క్లుప్తంగా

వైభవంగా అయ్యప్ప పడిపూజ



వెదురుపాకలో నిర్వహిస్తున్న అయ్యప్ప పడిపూజ

రాయవరం: మండలంలోని వెదురుపాకలో శుక్రవారం రాత్రి అయ్యప్ప స్వామి పడిపూజ వైభవంగా నిర్వహించారు. వెదురుపాక, వి.సావరం పీఠం గురుస్వాములు బండారు వెంకటరమణ, త్రిమూర్తులు, కొంకుదురుకు చెందిన శైవాగమ పండితుడు రమణశర్మ అర్చకత్వంలో అయ్యప్ప స్వామికి 23 రకాల ద్రవ్యాలతో అభిషేకం, అష్టోత్తర కలశపూజలు నిర్వహించారు. అయ్యప్పస్వామికి ప్రత్యేకంగా అరటి బోదెలతో నిర్మించిన మందిరంలో పూజాదికాలు చేశారు. వెదురుపాక జనార్దనస్వామి ఆలయ ప్రాంగణంలోని అయ్యప్ప పీఠం స్వాములు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన అయ్యప్ప మాలధారులు సుమారు 200 మంది పడిపూజలో పాల్గొన్నారు. అష్టోత్తర పూజ అనంతరం అయ్యప్పలు పడిపాటకు లయబద్ధంగా పడితొక్కిన తీరు భక్తులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా గురుస్వాములు త్రిమూర్తులు, రమణ తదితరులను అయ్యప్ప మాలధారులు ఘనంగా సత్కరించారు. పడిపూజలో గ్రామానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కోటిపల్లి ఆలయ ఈఓగా భీమశంకరం



కోటిపల్లి ఛాయా సోమేశ్వరస్వామి ఆలయంలో వేదాశీర్వచనం అందుకుంటున్న ఈఓ భీమశంకరం

కె.గంగవరం: మండలంలోని కోటిపల్లి ఛాయా సోమేశ్వరస్వామి ఆలయ ఈఓగా జొన్నాడ భీమశంకరం శనివారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ సర్పవరం భావనారాయణ ఆలయంలో ఈఓగా పనిచేస్తూ బదిలీపై కోటిపల్లి వచ్చారు. ఈఓ భీమశంకరంకు శివల, పేకేరు గ్రామాల ఆలయాల బాధ్యతలు కూడా అప్పగించారు. ఇక్కడ ఇప్పటి వరకు ఈఓగా పనిచేసిన శ్రీదేవి కాకినాడ పైండా చలమయ్య ట్రస్ట్‌కు ఈఓగా బదిలీ అయ్యారు. ఈఓ భీమశంకరం బాధ్యతలు స్వీకరించిన అనంతరం స్వామివారిని దర్శించుకుని ఆలయ అర్చకుల వేదాశీర్వచనం అందుకున్నారు.

రామచంద్రపురం సబ్ రిజిస్ట్రార్‌గా శ్రీనివాస్



నూతన సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌కు జ్ఞాపిక అందిస్తున్న లేఖరి

రామచంద్రపురం: నూతన సబ్ రిజిస్ట్రార్‌గా తోట శ్రీనివాస్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఈయన పాలకొల్లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి రామచంద్రపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన సబ్ రిజిస్ట్రార్ యు.జగన్మోహనరావు అంబాజీపేట బదిలీపై వెళ్లారు. కాగా బాధ్యతలు స్వీకరించిన సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌ను లేఖర్లు, కక్షిదారులు జ్ఞాపికలు అందజేసి అభినందనలు తెలిపారు.

రామచంద్రపురం ఎస్సైగా శ్రీనివాస్



రామచంద్రపురం: పట్టణ ఎస్సైగా ఎస్.శ్రీనివాస్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన పి.వాసు ఈనెల ఒకటిన డ్యూటీలో చేరగా జాయిన్ అయిన 9 రోజులకే వీఆర్‌కు వెళ్లిపోయారు. కాగా గతంలో ఆత్రేయపురం ఎస్సైగా బాధ్యతలు నిర్వహించిన శ్రీనివాస్ ప్రస్తుతం ఇక్కడకు బదిలీపై వచ్చారు.

రేబిస్ వ్యాధి బారిన పడకుండా అవగాహన

రామచంద్రపురం రూరల్: ప్రపంచ రేబిస్ దినోత్సవం పురస్కరించుకుని ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్‌లో శనివారం ద్రాక్షారామ వెటర్నరీ డాక్టర్ మేడిశెట్టి కృష్ణార్జున ఆధ్వర్యంలో విద్యార్థులకు రేబిస్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని వాడ్రేవు రత్నపద్మావతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ కృష్ణార్జున మాట్లాడుతూ రేబిస్ వ్యాధి వచ్చే విధానం, పెంపుడు జంతువులకు టీకాల ప్రాముఖ్యత, కుక్క కరిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కుక్క కాటుకు గురయితే కుక్క కరచిన 3, 7, 14, 28 రోజుల్లో యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించుకోవాలన్నారు. కుక్క కరిచిన ఆ ప్రదేశంలో వెంటనే సబ్బు నీటితో 10 నిమిషాలు కడగాలని సూచించారు. వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి గిరజాల వెంకటసత్యసుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాలనపై దృష్టి మరల్చేందుకే విష రాజకీయం

- లడ్డూపై చంద్రబాబుది డ్రామా
- పలు ఆలయాల్లో నియోజకవర్గ కోఆర్డినేటర్ల ప్రత్యేక పూజలు



ద్రాక్షారామ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద పిల్లి సూర్యప్రకాశ్, పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు



మండపేటలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, నాయకులు, కార్యకర్తలు

రామచంద్రపురం రూరల్: గడచిన 100 రోజుల పాలనలో గొప్పగా సాధించింది ఏమీ లేదు. అయినా ఇది మంచి ప్రభుత్వం అంటూ స్టిక్కర్ల కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. తమ పాలనా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని ఏమార్చడానికే పరమ పవిత్రమైన తిరుపతి లడ్డూ ప్రసాదంపై బురద జల్లే విష రాజకీయానికి తెరలేపారని సీఎం నారా చంద్రబాబునాయుడిపై రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ మండిపడ్డారు. పవిత్ర పుణ్యక్షేత్రం ద్రాక్షారామలో వేంచేసిన వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ శ్రేణులతో కలసి వైఎస్సార్ సీపీపై బురద జల్లే కుటిల యత్నాన్ని తిప్పికొట్టే విధంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. సూర్యప్రకాశ్ మాట్లాడుతూ కలియుగ దైవం వెంకటేశ్వరస్వామి ప్రతిష్టను మంటగలిపే విధంగా పవిత్రమైన లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేశారంటూ మాజీ సీఎం వైఎస్ జగన్‌ని లక్ష్యంగా చేసుకుని చంద్రబాబు తప్పుడు ఆరోపణ చేశారన్నారు. ఒక గుజరాత్ సంస్థ రిపోర్టును బూచిగా చూపారన్నారు. దశాబ్దాలుగా స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన టీటీడీలో జరిగే ప్రసాదాల తయారీలో ఎటువంటి అవకతవకలు జరిగే అవకాశం లేకపోయినా ముఖ్యమంత్రి హోదాలో ఉండి చంద్రబాబు చేసిన ఆరోపణలు దురదృష్టకరమన్నారు. ప్రసాదాల తయారీలో వాడే నెయ్యి పరీక్షలు నిర్వహించి నాణ్యత ఉంటేనే ప్రసాదం తయారీలో వాడటం లేకపోతే వెనక్కి తిప్పి పంపుతారన్నారు. 2019–24 వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా 18 సార్లు నెయ్యి ట్యాంకర్లు వెనక్కి పంపినట్లు, అదే విధంగా చంద్రబాబు గత పాలనా కాలం 2014–2019 మధ్యలో 14 సార్లు ట్యాంకర్లు వెనక్కి పంపినట్లు రికార్డులు చెబుతున్నాయన్నారు. అలా నాణ్యత లేని నెయ్యిని వెనక్కి పంపినప్పుడు ఇక ప్రసాదం కల్తీ జరిగే ప్రసక్తి ఎక్కడ ఉంటుందన్నారు. గడచిన 10 రోజులుగా జరిగిన పరిణామాలు చూసిన ప్రజలకు వాస్తవాలు తెలిసిపోయి ప్రభుత్వం చేసిన తప్పు బయటపడటంతో ఇప్పుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవాలంటే డిక్లరేషన్ ఇవ్వాలని కొత్త వివాదానికి తెరలేపారన్నారు. ఎవరైనా ఇతర మతాలను అనుసరించేవారు తిరుపతి వేంకటేశ్వరస్వామిని దర్శించుకునే క్రమంలో మొదటి సారి వెళ్లినప్పుడు మాత్రమే



మండపేటలో స్వామివారి ఆలయానికి చేరుకుంటున్న పార్టీ నాయకులు

డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. వెళ్లిన ప్రతిసారీ ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. కానీ కూటమి నాయకులు కావాలని తమ ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికి తిరుపతి వేంకటేశ్వరస్వామి ప్రతిష్టను పణంగా పెడుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, ఎంపీపీ పంపన నాగమణి, రాష్ట్ర ఇండస్ట్రియల్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, మాజీ జెడ్పీటీసీలు ఇంత సంతోషం, పి.శ్రీనివాసరావు, పెమ్మిరెడ్డి మురళీకృష్ణ, జెడ్పీటీసీ వి.వెంకటసుబ్బారావు, మూడు మండలాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సుప్రీం జడ్జితో విచారణ జరిపించండి

మండపేట: తిరుమల లడ్డూ వ్యవహారంపై భారత అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపిస్తే అసలు విషయాలు బహిర్గతం అవుతాయని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు శనివారం ఉదయం పట్టణంలోని కలువపువ్వు సెంటర్లోని వేంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో ప్రక్షాళన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి సద్బుద్ధి ప్రసాదించాలంటూ స్వామివారిని ప్రార్థించారు. కార్యక్రమానికి నియోజకవర్గ నలుమూలల వందలాది మంది కార్యకర్తలు హాజరయ్యారు. తొలుత విజయలక్ష్మి నగర్లోని వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో మోటార్ సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. రాజరత్న సెంటర్, బస్ స్టాండ్, వాణీమహల్ జంక్షన్ మీదుగా కలువపువ్వు సెంటర్‌కు చేరుకున్నారు. ఈ ర్యాలీలో మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ దుర్గారాణి మూడు మండలాల జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

భగవంతునికి మతాన్ని అంటగడతారా?

భగవంతుడు అందరికి ఆరాధ్యుడేనని, అటువంటి భగవంతునికి మతాలు అంటగట్టడం మహాపాపం అని ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. భగవంతుడు మనకు ప్రసాదించిన మానవ జన్మను చరితార్థం చేసుకోవాలే తప్ప మత ద్వేషాలకు పోకూడదన్నారు. కొందరు దుర్మార్గులు రాజకీయాల్లో మతాలను చొప్పిస్తున్నారంటూ తోట ఆగ్రహం వ్యక్తం చేశారు. గత పదమూడేళ్లలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సార్లు తిరుమలను దర్శించుకున్నారని, వందలాది పర్యటనలు చేశారని గుర్తుచేశారు. అప్పుడు లేని నిబంధనలు నేడు తాజాగా ఆయనకు ఆపాదించడం రాజకీయం కాదా? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర నేతలు రెడ్డి రాధాకృష్ణ, కర్రి పాపారాయుడు, పుట్టపూడి అబ్బు, కురుపూడి రాంబాబు, మేడిశెట్టి సత్యవేణి దుర్గారావు, వుండమట్ల శ్రీనివాస్, నవుడు వెంకటరమణ, పిల్లా వీరబాబు, ముమ్మిడివరపు బాపిరాజు, వైఎస్సార్ సీపీ మున్సిపల్ కౌన్సిలర్లు, శెట్టి నాగేశ్వరరావు, కార్యకర్తలు, నాయకులు, అభిమానులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

పాఠశాలల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం



కపిలేశ్వరపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న సుబ్రహ్మణ్యం



అంగర జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బోధనా తీరును పరిశీలిస్తున్న సుబ్రహ్మణ్యం

జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి సుబ్రహ్మణ్యం

కపిలేశ్వరపురం: పాఠశాలల్లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, అందుకోసం ప్రభుత్వాదేశాలను విధిగా అమలు చేయాలని జిల్లా సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి బి.సుబ్రహ్మణ్యం ఆదేశించారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాల పర్యవేక్షణలో భాగంగా శనివారం మండలంలోని అంగర, కపిలేశ్వరపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ పక్వాడా కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని పాఠశాలల్లో విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. కపిలేశ్వరపురంలో విద్యార్థులచే నిర్వహించిన మానవహారంలో సుబ్రహ్మణ్యం స్వయంగా పాల్గొన్నారు. విద్యార్థులు తమ సృజనాత్మకతతో రూపొందించిన ప్ల కార్డులను ప్రదర్శిస్తూ పారిశుద్ధ్య పరిరక్షణ కోరుతూ నినదించారు. అంగర జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎకో క్లబ్, మధ్యాహ్న భోజనం నిర్వహణ తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యార్థులతో పలు సామాజిక అంశాలపై ముచ్చటించారు. ఆయా కార్యక్రమాల్లో హెచ్ఎంలు అంగర రాజు, వంగా శ్రీనివాస్, ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఐఈఆర్‌పీల విధుల పరిశీలన...

భవిత కేంద్రాల ద్వారా మానసిక వైకల్యంతో బాధపడుతున్న చిన్నాలకు గృహ ఆధారిత విద్యను అందిస్తున్న తీరును పరిశీలించారు. విద్యనందిస్తున్న ఐఈఆర్‌టీలతో కలిసి చిన్నారుల నివాసాలను సందర్శించారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యమైన సమాజం



రాయవరంలో సీమంతాలు చేస్తున్న ఐసీడీఎస్ పీవో గజలక్ష్మి తదితరులు

రాయవరం: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజానికి బాటలు వేయవచ్చని ఐసీడీఎస్ పీవో అధికారి గజలక్ష్మి, మండల పరిషత్ కార్యాలయ ఏవో శ్రీనివాస్, ఎంఈవో–2 వై.సూర్యనారాయణ పేర్కొన్నారు. పౌష్టికాహార మాసోత్సవం మండల స్థాయి ముగింపు కార్యక్రమాన్ని శనివారం స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. మాట్లాడుతూ ముఖ్యంగా గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే వారికి ఆరోగ్యవంతమైన శిశువులకు జన్మనిస్తారన్నారు. తద్వారా ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందన్నారు. అనంతరం స్థానిక నేత వుండవిల్లి రాంబాబు సౌజన్యంతో 20 మంది గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. వారికి పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, స్వీట్లు, నూతన వస్త్రాలు అందించారు. కార్యక్రమంలో స్థానిక జెడ్పీ హైస్కూల్ ఎస్ఎంసీ చైర్మన్ దేవిశెట్టి చిన్ని, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల నేతలు దొమ్మేటి ఆదిలక్ష్మి, సలుమూరి కృష్ణకుమారి, వివిధ గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

దేవీ నవరాత్రులకు రాట ముహూర్తం



గొల్లపాలెంలో దేవీనవరాత్రులకు రాట ముహూర్తం నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

కాజులూరు: గొల్లపాలెం కొత్తపేట దుర్గాదేవి ఆలయం వద్ద నిర్వహించనున్న దేవీనవరాత్రులకు శనివారం కమిటీ సభ్యులు రాటముహూర్తం నిర్వహించారు. ఏటా కొత్తపేటలో స్థానికులు దేవీనవరాత్ర ఉత్సవాలు చేపట్టి నవరాత్రి తొమ్మిది రోజులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. అక్టోబర్ మూడో తేది గురువారం నుంచి దేవీనవరాత్రి ఉత్సవాలు ప్రారంభమౌతాయని ఇందులో భాగంగా ఈ ఏడాది ఆలయం వద్ద ప్రధాన అర్చకులు బాదంపూడి నాగవెంకట సుబ్రహ్మణ్య (పండుస్వామి) ఆధ్వర్యంలో కుంకుమార్చనలు, నిప్పులగుండం, గోమాత పూజలు, జ్యోతిర్లింగార్చన, రంగవల్లి పోటీలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆలయ నిర్వాహక కమిటీ చైర్మన్, రిటైర్డ్ జిల్లా సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ సనపాల ధనరాజు తెలిపారు. ఉప సర్పంచ్ తాడి భువనేశ్వరిదేవి, కమిటీ సభ్యులు అంగర కృష్ణ, అంగర శ్రీను రాటముహూర్తం కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించారు.

వ్యాసరచన పోటీల్లో ద్వితీయ స్థానం



మామిడాడ శిరీష



సలాది ధనేశ్వరి

కాజులూరు: వైద్య ఆరోగ్య శాఖ జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో తమ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించినట్టు కాజులూరు జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పంపన కృష్ణమూర్తి తెలిపారు. శనివారం గ్రామంలో ఆయన మాట్లాడుతూ కాకినాడ గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్‌లో వైద్య ఆరోగ్య శాఖ జిల్లాలోని 21 మండల స్థాయిలో వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించిందన్నారు. ఈ పోటీల్లో తమ పాఠశాల నుంచి మామిడాడ శిరీష, సలాది ధనేశ్వరి పాల్గొని వ్యాసరచన పోటీల్లో ద్వితీయ స్థానం సాదించి ప్రశంసా పత్రాలను, రూ.ఆరువేలు నగదు బహుమతిని గెలుచుకున్నారన్నారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు జె.శామ్యూల్‌బెన్‌హర్, కేవీవీ సత్యనారాయణ, కె.హరినాథ్, చింతా నారాయణమూర్తి, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ పెంటపాటి పద్దరాజు తదితరులు అభినందనలు తెలిపారు.

మార్చిలోగా ఇంటి నిర్మాణం పూర్తి చేయండి

- లేదంటే గ్రాంట్ వెనక్కు వెళ్లిపోతుంది
- హౌసింగ్ ఏఈ జీఎస్ఎన్ దాసు



వెదురుపాకలో గృహ నిర్మాణ లబ్ధిదారుల అవగాహన సమావేశం



కపిలేశ్వరపురంలో లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న ప్రతినిధి



రామచంద్రపురం సమావేశంలో సాయిప్రసాద్

రాయవరం: మండలంలోని వెదురుపాక పంచాయతీ వద్ద హౌసింగ్ శాఖ అధికారులు గృహ నిర్మాణ లబ్ధిదారులకు శనివారం అవగాహనా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హౌసింగ్ ఏఈ జీఎస్ఎన్ దాసు మాట్లాడుతూ గతంలో మంజూరైన గృహ నిర్మాణాల్లో భాగంగా ప్రధానమంతి ఆవాస్ యోజన కింద కేంద్ర ప్రభుత్వం ఇల్లు నిర్మించుకునే లబ్ధిదారుడికి రూ.1.80 లక్షలు మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో గృహ నిర్మాణం ప్రారంభించిన వారు వచ్చే ఏడాది మార్చిలోగా పూర్తి చేసుకోవాలని, లేకుంటే ఆ గ్రాంట్ వెనక్కి వెళ్లి పోయే అవకాశం ఉందన్నారు. మండలంలో పునాది స్థాయిలో 112, లింటల్ లెవల్ 405, రూఫ్ లెవల్ 31, స్లాబు లెవల్‌లో 14 ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయన్నారు. గృహ నిర్మాణ లబ్ధిదారులకు అవగాహన కల్పించేందుకు మన ఇల్లు–మన గౌరవం పేరుతో ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఏఈ దాసు తెలిపారు. సమావేశంలో మండల పరిషత్ కార్యాలయ సూపరిటెండెంట్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి అత్తిలి గోవిందరాజులు, డ్వాక్రా యానిమేటర్లు, సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మన ఇల్లు – మన గౌరవంపై అవగాహన

కపిలేశ్వరపురం: మన ఇల్లు–మన గౌరవం పేరుతో మండలంలోని గ్రామాల్లో శనివారం ఇంటి నిర్మాణాలపై అధికారులు అవగాహన సదస్సులు నిర్వహించారు. కపిలేశ్వరపురం, అచ్యుతాపురం, తాతపూడి, కాలేరు, నల్లూరు, నేలటూరు, టేకి, వాకతిప్ప, పడమర ఖండ్రిక, మాచర, వడ్లమూరు, వెదురుమూడి, నాగులచెరువు గ్రామాల్లో నిర్వహించిన సదస్సుల్లో ఇంటి నిర్మాణానికి గృహ నిర్మాణ శాఖ ద్వారా అందించే సాయం వివరాలపై అవగాహన కల్పించారు. కపిలేశ్వరపురంలో నిర్వహించిన సదస్సులో ఎంపీడీఓ ఏవీవీఎస్ఆర్ కొండలరావు, హౌసింగ్ డీఈ కె.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గృహ నిర్మాణ రుణం మంజూరైనవారు 2025 మార్చిలోగా నిర్మాణాలను పూర్తి చేసుకోవాలన్నారు. గృహ నిర్మాణ శాఖ నుంచి సిమెంట్, ఇనుము సరఫరా చేస్తారన్నారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, కార్యదర్శిలు, గృహ నిర్మాణ శాఖ ప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి

రామచంద్రపురం: జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసే విధంగా హౌసింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చీఫ్ విప్ వాడ్రేవు సాయిప్రసాద్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని 23వ వార్డు హౌసింగ్ లబ్ధిదారులతో గృహ నిర్మాణ శాఖ అధికారి భీమశంకరం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో స్థానిక కౌన్సిలర్‌గా ఉన్న సాయిప్రసాద్ మాట్లాడుతూ వార్డులో 33 మందికి జగనన్న కాలనీలో ఇళ్లస్థలాలు అందజేశారన్నారు. ఇందులో 28 మంది ఇళ్ల నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. కాగా పదో సచివాలయ పరిధిలో 68 మంది లబ్ధిదారులు ఉన్నారన్నారు. ఇందులో 8 మంది లబ్ధిదారులకు ఫిల్లింగ్ కూడా జరగలేదని తెలిపారు. కాంట్రాక్టర్ ద్వారా కట్టించుకుంటున్న లబ్ధిదారులు తొందరగా నిర్మాణాలు పూర్తి చేయించవలసిన బాధ్యత వారిపై ఉందని తెలిపారు. హౌసింగ్ అధికారి భీమశంకరం మాట్లాడుతూ వచ్చే సంవత్సరం మార్చి నెలాఖరులోగా నిర్మాణాలను పూర్తి చేయని వారికి పీఎంఏవైలో మంజూరైన గృహాలకి ఈ పథకం వర్తించదన్నారు. సొంత నిధులతో కట్టుకోవాలని తెలిపారు. అందుకని పురోగతిలో ఉన్న గృహాలను ఆరు నెలల్లోగా పూర్తి చేయడానికి ప్రయత్నించాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ ఎమినిటీస్ కార్యదర్శి శిరీష, కూటమి నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు 'కృత్తివెంటి' విద్యార్థినులు



రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైన వారిని అభినందిస్తున్న డీవైఈఓ నరసింహ తదితరులు

రామచంద్రపురం: ఏపీ స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు జాతీయ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు హెచ్ఎం టి.రాఘవరెడ్డి శనివారం విలేకరులకు తెలిపారు. ఈ నెల 26న కాకినాడ డీఎస్ఏ గ్రౌండ్‌లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ పోటీల ఎంపికలు జరిగాయన్నారు. అండర్–19 విభాగంలో పాఠశాలకు చెందిన జి.పావనికుమారి, అండర్ –17 విభాగంలో డి.అపర్ణ, అండర్– 14 విభాగంలో సీహెచ్ ఐశ్వర్యాంబికలు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన క్రీడాకారులను డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఎస్ఎల్ నరసింహ, ఎస్ఎంసీ చైర్మన్ కేవీఎస్ఎస్ గంగరాజు, హెచ్ఎం వీరరాఘవరెడ్డి అభినందించారు. వచ్చే నెలలో శ్రీకాకుళం, మార్టేరుల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నారు.

వీఆర్‌ఏ రాములు మృతి



మల్లేశ్వరపు రాములు (ఫైల్)

రాయవరం: స్థానిక విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్ (వీఆర్ఏ) మల్లేశ్వరపు రాములు (85) శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన 45 ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. వీఆర్ఏ అసోసియేషన్ అధ్యక్షుడిగా కూడా రాములు వ్యవహరించాడు. గ్రామ రెవెన్యూ సహాయకులకు పదవీ విరమణ లేకపోవడంతో విధుల్లో ఉంటూనే అనారోగ్య కారణంతో మృతి చెందాడు. తహసీల్దారు ఐపీ శెట్టి, ఆర్ఐ పంపన రామారావు, ఇతర సిబ్బంది రాములు భౌతికకాయాన్ని సందర్శించి సంతాపం వ్యక్తం చేశారు. రాములు మృతి రెవెన్యూ శాఖకు తీరని లోటుగా రెవెన్యూ సిబ్బంది పేర్కొన్నారు.


ముగిసిన తెలుగు భాషా వారోత్సవాలు



తెలుగు భాషా వారోత్సవాల్లో తెలుగు భాష విశిష్టతను వివరిస్తున్న ఉపాధ్యాయులు

కాజులూరు: కాజులూరు జెడ్పీ హైస్కూల్‌లో గత వారం రోజులుగా జరుగుతున్న తెలుగు భాషా వారోత్సవాలు ఘనంగా ముగిశాయి. పాఠశాలలో ఈ నెల 21వ తేదీ శనివారం ప్రముఖ కవి గురజాడ అప్పారావు జయంతి పురస్కరించుకుని తెలుగు భాషా వారోత్సవాలు ప్రారంభించిన ఉపాధ్యాయులు 28వ తేదీ శనివారం మరో ప్రముఖ కవి గుర్రం జాషువా జయంతి పురస్కరించుకుని ముగింపు పలికారు. వారోత్సవాల్లో భాగంగా వారం రోజుల పాటు తెలుగు భాషపై విద్యార్థులకు మక్కువ పెరిగేలా వారితో పలువురు ప్రముఖ కవులు, రచయతల రూపాలతో వేషధారణ చేయించి వారి జీవిత చరిత్రలపై అవగాహన కల్పించారు. తెలుగు భాషాభివృద్ధికి ఎనలేని కృషి చేసిన పలువురి ప్రముఖుల చిత్రపటాలతో ఫొటో ఎగ్జిబిషన్ నిర్వహించి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చివరిరోజు ముగింపు సందర్భంగా తెలుగు భాషా ప్రావీణ్యతపై పలు పోటీలు నిర్వహించి నైపుణ్యం ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమాల్లో స్కూల్ హెచ్ఎం పంపన కృష్ణమూర్తి, తెలుగు భాషా పండితులు వీరభద్రరావు, ఉపాధ్యాయులు జె.శామ్యూల్‌బెన్‌హర్, కేవీవీ సత్యనారాయణ, కె.హరినాథ్, చింతా నారాయణమూర్తి, సునీలాదేవి, వలీబాషా, రాజరాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి



విద్యుత్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న రాజాబాబు

రామచంద్రపురం: కోనసీమ జిల్లా వ్యాప్తంగా ఎక్కడైనా అపరిష్కృతంగా ఉన్న లైన్లు, ఇతర విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని జిల్లా విద్యుత్ శాఖ నూతన సూపరింటెండెంట్ ఇంజనీర్ సిద్దెల రాజబాబు తెలిపారు. సాధారణ తనిఖీలలో భాగంగా రామచంద్రపురం విద్యుత్ శాఖ కార్యాలయాన్ని ఆయన శనివారం సందర్శించారు. కార్యాలయంలో రికార్డు పరిశీలన అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నూతన రిజిస్ట్రేషన్, విద్యుత్ సమస్యల పరిష్కారానికి వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్ 1912 సంప్రదించవచ్చని తెలిపారు. పీఎం సూర్యఘర్ రూఫ్ టాప్ సోలార్ సబ్సిడీ వినియోగదారులు రిజిస్ట్రేషన్ నిమిత్తం విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రత్నాలరావు, కంచుమర్తి మురళీమోహన్, రామచంద్రపురం ఏఈ మేడిశెట్టి వెంకటరమణ, ఆలమూరు ఏఈ డీఎంఈ ప్రసాద్ విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

కాలనీలో పారిశుధ్య పనుల పరిశీలన

మండపేట: స్థానిక 20వ వార్డు వైఎస్సార్ కాలనీలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను మున్సిపల్ చైర్ పర్సన్ దుర్గారాణి శనివారం పరిశీలించారు. కాలనీలోని రోడ్ల పక్కనే పెరిగిపోయిన తుప్పలు, పిచ్చిగడ్డిని పారిశుధ్య కార్మికులు తొలగించారు. కాలనీ అంతా తిరిగి ఎక్కడెక్కడ తుప్పలు పెరిగిపోయాయో చూసి వాటిని తొలగించాలని చైర్ పర్సన్ వారిని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పేరూరి మాధవి, బత్తిన దొరబాబు, కాకాడ నూకరాజు, కొమ్మోజు నాగేశ్వరరావు, సచివాలయ సెక్రటరీ వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.